కథ

# కొలబద్ద

తమిరిశ జానకి

రామారావు పనిచేసే ఆఫీసులోనే పని చేస్తున్నాడు చలపతి. కానీ అతనితో మాట్లాడటానికి ఇష్టపడడు రామారావు. ఎప్పుడైనా చలపతి పలకరించబోతే ఏదో వంకన తప్పించుకుంటూ ఉంటాడు. దానికి కారణం... చాలామంచివాడు, ఎంతో మంచివాడు అంటూ అందరూ పొగిడే ఆ మనిషంటే రామారావుకి ఈర్ష్య... అసూయ.

''ఒక మనిషి మంచితనం అంచనా వేసేందుకు నువ్వు ఉపయోగించే కొలబద్ద ఏమిటి?'' అడిగాడు తన భార్యని ఒకరోజు.

''బాబోయ్! నాకు ఏ కొలబద్దా తెలియదు... వెదురుబద్దా తెలియదు'' దండం పెట్టింది వాణి.

''పోనీ... ఈ ప్రశ్నకి సమాధానం చెప్పు. ఇరుగుపొరుగు ఇళ్ళల్లో ఆడవాళ్ళు నీకు బాగా పరిచయమే కదా... అందర్లోకీ ఎవరెక్కువ మంచివాళ్ళు నీ దృష్టిలో?'' వెంటనే మాట్లాడ లేదు వాణి... ఒక్కక్షణం ఆలోచించి చెప్పబోయింది.

''వీడి ప్రశ్నకి జవాబు చెప్పేదేవిటన్న నిర్లక్ష్యమా?'' బాణంలా దూసుకొచ్చింది మాట. మనసు చివుక్కుమంది వాణికి. పెళ్ళయినప్పటి నించీ గమనిస్తూనే ఉంది ఆ విసుగు... చిరాకు... ఆ తొందరపాటు మాటలూ...

''అందర్లోకీ సుజాతగారూ మంచిగా అనిపిస్తారు నాకు''.

''దొరికిపోయావు చూశావా? ఆవిడెక్కువ మంచిమనిషి అంటున్నావు... ఆవిడతో పాటూ మిగిలిన వాళ్ళ గుణగణాలు కూడా లెక్కలోకి తీసుకున్నావు కదా? దీనికంతటికీ నువ్వు ఉపయోగించిన ఆ కొలబద్ద ఏదో చెప్పు''.

''నాకదంతా తెలియదండీ. నిజంగా చెప్తున్నాను... ఆవిడ చాలా సింపుల్‌గా ఉంటుంది. ఎప్పుడూ మొహంలో చిరునవ్వు తొంగి చూస్తుంటుంది...'' ఇంకొ ఏదో చెప్పబోతుంటే మధ్యలోనే కస్సుమన్నాడు.

''సింపుల్‌గా ఉండడమే నీ దృష్టిలో మంచితనం అన్నమాట. నేను స్టైల్‌గా ఉంటాను.... అంటే... నీ దృష్టిలో మంచి వాడిని కాదన్న మాట...''

ఉలిక్కిపడింది.

''ఏవిటండీ మీరు మరీను. పిడుక్కీ బియ్యానికీ ఒక్కటే మంత్రం అన్నట్టు మాట్లాడుతున్నారే?'' ఎప్పుడో కాలం చేసిన తన పెద్ద తాతయ్య గుర్తొచ్చాడు వాణికి.

కాలికివేస్తే మెడకీ, మెడకివేస్తే కాలికీ వేసే వాడు మాటల్తో.... తన తాతయ్య పోలిక ఈయనకెలా వొచ్చిందబ్బా?

''ఏవిటాలోచిస్తున్నావు?'' చెప్పలేనంత చిరాకు ఆ గొంతులో.

''మీరు స్టైల్ కొడతారని... అదే... స్టైల్‌గా ఉంటారని నేనెప్పుడూ అనలేదు కదండీ...'' ఈ జవాబుకి సంతోషిస్తాడనుకుంది.

''అంటే?... నేను డబ్బాగాడినని నీ ఉద్దేశ్యం కాబోలు''.

చెంపలేసుకుంది. ''అలా అని కాదండీ... నేనలా అనలేదు..''

చటుక్కున లేచి విసవిసా బయటికి వెళ్ళిపోయాడు. తెల్లబోయింది వాణి.

***

మెకానిక్ కుర్రాడు తన స్కూటర్ రిపేర్ చేస్తుంటే అక్కడే నిలబడ్డాడు రామారావు. అటు వైపుగా వెళ్తున్న ఒక పెద్దాయన ఆగి నిలబడి కుర్రాడిని పలకరించి యోగక్షేమాలడిగి నవ్వుతూ చెయ్యి ఊపి వెళ్ళాడు.

వెళ్తున్న ఆయన వంకే చూస్తూ ''చాలా మంచాయన'' అంటున్న ఆ కుర్రాడి మొహంలో ఖచ్చితమైన అభిప్రాయం కనపడింది రామారావుకి.

చటుక్కున అక్కడున్న స్టూల్ లాక్కుని కూచున్నాడు.

''ఆయన మంచివాడని ఎలా చెప్పగలుగుతున్నావు?''

వింతగా చూశాడు వాడు ''అదేంటిసార్... ఎన్నాళ్ళగానో మనకి పరిచయం ఉన్న వాళ్ళల్లో ఎవరెలాంటి వాళ్ళో ఆ మాత్రం మనకి తెలియదా సార్?''

''నేనెలాంటివాడిని?'' వెంటనే అడిగాడు. మొహంలో కించిత్తు గర్వంతో దర్పంగా చూశాడు.

''పోండి సార్...'' దీర్ఘం తీస్తూ తలొంచుకుని స్క్రూడ్రైవర్ చేతిలోకి తీసుకున్నాడు. తన లోని అహాన్ని దెబ్బకొట్టినట్టనిపించింది రామారావుకి. అయినా మళ్ళీ అడగడానికి మొహం చెల్లలేదు. ధైర్యమూ చాల్లేదు. గట్టిగా అడిగితే ఏం వినవలసి వస్తుందోనన్న అనుమానం. కానీ మనసులో మాత్రం ఓ ప్రశ్న నిగడదన్నుకుంటూ లేచి నిలబడింది.

''మీ కేంసార్? మీరు మంచివారు...'' అంటూ టక్కున వెంటనే వాడెందుకు జవాబు చెప్పలేదు?....

ఇంక ఆ రాత్రి నిద్రపట్టడం కష్టమైపోయింది. మాటిమాటికీ ఆ మెకానిక్ కుర్రాడే కళ్ళముందు కనిపిస్తున్నాడు.

''ఏవిటండీ... నిద్రపట్టట్లేదా?...'' కళ్ళు మూసుకునే పక్కకి ఒత్తిగిల్లుతూ అడిగింది వాణి.

''నువ్వు నా ప్రశ్నకి సమాధానం ఇవ్వలేదు పొద్దున్న...'' చక్రం ఆమె మీదకి తిప్పాడు. కునుకు పట్టబోతున్న ఆమెకి మొహమ్మీద నీళ్ళు చల్లినట్టయింది.

''వేళాకోళం చాలుగానీ పడుకోండి. మీ ప్రశ్నలకి జవాబులు చెప్పేటంత తెలివి తేటలు నాకు లేవు. మా అమ్మమ్మ అంటూ ఉండేదిలెండి... ధర్మరాజుకి చెడ్డవాళ్ళు కనపడ లేదుట... దుర్యోధనుడికి మంచివాళ్ళు కనపడలేదుట...''

తానుకోపంగా చూసినా ఆ చీకట్లో ఆమెకెలాగూ కనపడదు కాబట్టి నోరు మూసుకుని పడుకున్నాడు.

తన కోపమే తన శత్రువని చిన్నప్పుడు చదువుకున్నది పెద్దయ్యాక గుర్తుండాలని ఎక్కడుందీ? అయినా చదువుకున్న నీతులు ఎదుటివాళ్ళకి చెప్పడానికి తప్ప ఎవరికి వాళ్ళు పాటించడానికా?

అసలైనా ఆఫీసులో అందరూ ఆ చలపతిని ఎందుకు అంతగా మెచ్చుకుంటూ ఉంటారు? ఏవిటతని గొప్ప?.... తనకంటే అతనేమీ ధనవంతుడు కాదు... తనకంటే అందగాడు కాదు. పెద్దపెద్ద వాళ్ళతో గొప్ప పరిచయాలేమీ లేవు. తనకి ఉన్నట్టుగా... ఆఫీసర్ గారితో అట్టే చనువు కూడా లేదు... ఆయన తనతో కబుర్లు చెప్తాడు... చలపతితో ఎప్పుడూ కబుర్లు వేసుకోడు.

చలపతి కూడా ఆయన దృష్టిలో పడాలని గానీ... ఆయన తనతో ఆ మాటా ఈ మాటా మాట్లాడాలని గానీ ఆశించడు. దానికోసం ఎదురు చూడడు.

తన పని తను సరిగ్గా సక్రమంగా ఆలస్యం లేకుండా చేసుకు పోతుంటాడు.

చేసిన పనిలో వంకపెట్టడానికేమీ ఉండదు.... ఎంతపని ఇచ్చినా ఏమీ విసుక్కోడు. అది చాలా లాభదాయకంగా ఉంది తనబోటి పని దొంగలకి.

అసలైనా అసూయ ఆడవాళ్ళ సొత్తు అంటారు కదా? తనకెందుకూ అతన్ని చూస్తే అసూయ?

మరునిమిషంలో తనకి తనే చెప్పుకున్నాడు... అసూయ అని ఎందుకు అనుకోవాలి? పొగడటం చిరాకు కలిగిస్తోంది తనకి అని ఎందుకు అనుకోకూడదు?

ఈ ఆలోచనకి ఎదురు తిరిగింది మనస్సాక్షి.

అందరూ చలపతిని పొగడటం తనకి చిరాకు మాత్రమే అయితే... ఆ మెచ్చుకోవడాలు విసుగు మాత్రమే అయితే... మరి... వాళ్ళందరూ ఎప్పుడూ తనని పొగుడుతూ ఉండాలి... తననే పొగుడుతూ ఉండాలి భట్రాజుల్లా అని ఎందుకాశిస్తున్నాడు తను? అప్పుడా విసుగులూ చిరాకులూ ఉండవా? అంటే దీని అర్థం చలపతిని చూసి అసూయ పడటం కాదా?

ఎదురు తిరిగిన మనస్సాక్షి సమాధానం చెప్పకోలేని రామారావు కళ్ళలోకి ఎర్రదనం వచ్చింది నిద్రరాలేదు.

***

ఆ రోజు పొద్దున్నే తమ ఇంటిగుమ్మంలో చలపతి కనిపించేసరికి ఆశ్చర్యంగా అనిపించింది రామారావుకి.

వీడెందుకొచ్చినట్టూ?.... ఓ రకమైన నిర్లక్ష్యం కూడా తొంగిచూసింది... రామారావు ఇల్లు అదని చలపతికి తెలియదు.

నవ్వుతూ పలకరించాడు ''మీ పక్క వాటాకి 'టు లెట్' బోర్డు చూసి ఇక్కడ ఆగాను. మీరుండేది ఇక్కడే అని తెలియదు. మేము ఉండే ఇంటి వాళ్ళబ్బాయికి ఈ ఊరు బదిలీ అయివొస్తున్నారు. ఇల్లు వాళ్ళక్కావాలి అందుకని మమ్మల్ని ఖాళీ చెయ్యమన్నారు. పోన్లెండి మీరు తెల్సిన వాళ్ళున్నారిక్కడ. ఇంక దిగుల్లేదు. ఈ ఇంటి గురించిగానీ ఇంటివాళ్ళ గురించి గానీ నేను వాకబుచేసుకోనక్కర్లేదు. మీకు నేను తెలిసిన వాడినే అని ఇంటాయనతో కాస్త మీరుచెప్తే నాకు అద్దెకి ఇవ్వడానికి ఆయన తర్జనభర్జన పడక్కర్లేకుండా పని సులువవుతుంది కదా! చెప్తారా మీరు?''


''అలాగే... తర్వాత మాట్లాడతాను'' తుంచేసినట్టుగా జవాబిచ్చాడు రామారావు.

''అమ్మో! తన పక్కన ఈ చలపతి ఉండడమా? ఏ మాత్రం తనకి ఇష్టం లేని వ్యక్తి...'' చలపతి వెళ్ళిపోయాక తనలో తనే అనుకున్నాడు రామారావు.

అందుకే ఇంటి యజమానికి ఫోన్‌చేసి చలపతి గురించి చెప్పలేదు.

వేరేవాళ్ళకి ఇప్పించేశాడు ఆయనతో చెప్పి.

ఆఫీసులో మాత్రం నాటకం ఆడాడు ''ఏమీ



అనుకోకు... వాళ్ళక్కావల్సిన వాళ్ళే ఎవరో ఉన్నారుట ఇంటి యజమానికి. వాళ్ళకే ఇల్లు అద్దెకిచ్చారట. ఒకటో తేదీ వొస్తున్నారట వాళ్ళు''.

"పోన్లెండి... వాళ్ళిష్టం. మనం ఎవరం కాదనడానికి. మీరు చెయ్యవల్సింది మీరు చేశారు. మీ తప్పేదో ఉన్నట్టు బాధపడకండి. మీకు నా థాంక్స్'' మనస్ఫూర్తిగా అన్నాడు చలపతి.


బతికిపోయాననుకున్నాడు రామారావు. చాలా తేలిగ్గా మాటల్తో బురిడీ కొట్టించవచ్చు ఇతగాడిని అన్న అభిప్రాయం బాగానే బలపడిపోయింది ఇది వరకే.

అందుకే చలపతి అంటే చులకనభావం కూడా పాతుకుపోయింది అసూయతో పాటూ...

కానీ... నిజానికి... చలపతి మనస్తత్వాన్ని అర్థం చేసుకునే తెలివితేటలు తనకి లేవన్న సంగతి చూచాయగా కూడా తెలుసుకోలేకపోతున్న వాడు రామారావు...

కొందరంతే... తెలివితేటలు తమ సొంతం అనుకుంటూ ఎదుటివ్యక్తి మంచితనాన్ని చేతకానితనంగా లెక్క కట్టేసి గొప్పలు పోతుంటారు. అటువంటి వారికి భిన్నం కాదు రామారావు... వారి కోవలోకే వొస్తాడు.

పైగా చలపతిలాంటి వాళ్ళు తనలాంటి వాళ్ళ చేతుల్లో తోలుబొమ్మలనే అతని ఉద్దేశ్యం.



కాస్త మనసుపెట్టి లోతుగా ఆలోచిస్తే తన అభిప్రాయం సరియైనది కాదని తెలుస్తుంది. కానీ అందుకు అవకాశం ఇవ్వడం ఏ మాత్రం ఇష్టం లేదు. అవసరం ఉందనీ భావించట్లేదు...

అది నిర్లక్ష్యం కావచ్చు... లేదా అహంకారం కావచ్చు...

***

రేపు నువ్వు చెన్నయ్ వెళ్ళి ఫలానావాళ్ళని కలిసి ఒక పని పూర్తిచేసుకుని రావాలి రామారావు అంటూ ఆఫీస్ పనోటి చెప్పాడు ఆఫీసర్‌గారు. రామారావు గుండెల్లో రాయిపడినట్టయ్యింది... ఎందుకంటే... ఆయన చెప్పే పని జరిగేది కాదనే అనిపించింది. అవతలి పార్టీవాళ్ళు గట్టి పిండాలు. ఈయనగారు పెట్టే కండిషన్లకి వాళ్ళొప్పుకోరు.

పని సాధించుకురాలేక పోతే ఈయనే కాదు ఆఫీసులో అందరూ కూడా తనని ఒక చేతకాని వాడుగా చూడరూ?

బుఱ్ర చురుగ్గా పని చేసింది... ఈ పని మీద చలపతిని పంపించమని సలహా ఇస్తే?

అతనెలాగో ఆ పని విజయవంతంగా సాధించుకుని రాలేడు. దాంతో ఆఫీసరే కాదు అందరూ కూడా అప్పుడు చలపతినొక చేతకాని వాడుగా చూస్తారు... అదేకదా తనకి కావల్సింది... అందరి దృష్టిలో అతను చులకన అయితే అంతకంటే ఏం కావాలి తనకి? ఇదే మంచి అవకాశం... వొదులుకోకూడదు.... ఈ ఆలోచనతో ఓ గంటపోయాక మెల్లిగా ఆఫీసర్ గారి గదిలో అడుగుపెట్టాడు.

"సార్... రేపు చెన్నయ్‌కి చలపతిని పంపించడం మంచిదేమో అనిపిసిప్తోంది. ముంబై నించి రేపు పాటిల్ వొస్తున్నాడు కదా మన ఆఫీసుకి... నేనెళ్ళిపోతే ఎలా?''

తను లేకపోయినా మునిగిపోయేదేం లేదు... కానీ... ఆఫీసర్ మహాశయుడికి అలాంటి అభిప్రాయం కలిగించడంలో దిట్ట కదా మరితను...

"ఔనౌను... మర్చేపోయాను... ఆ చలపతిని పంపిస్తాను...'' రామారావు మాటలకి ఏకీభవించే

శాడు.

''రేపటి ప్రయాణం గురించీ అక్కడ ఏం పని చేసుకురావాలీ అన్నీ వివరంగా నేను చెప్పేస్తా లెండి చలపతికి''.

ఒక్క క్షణం అదోలా చూశాడాయన.

ఏమనుకున్నాడో ఏమో... అంగీకార సూచకంగా తల మాత్రం ఊపి ఊరుకున్నాడు. బతుకు జీవుడా అనుకున్నాడు రామారావు.

వెళ్ళవలసిన పని గురించి చలపతికి చెప్పాడంతే... దాన్లోని సాధక బాధకాలు చెప్పలేదు. సాధించుకు రావడానికి ఉపయుక్తంగా అనిపించే సుళువులు మెళుకువలు ఏమీ ప్రస్తావించలేదు. అక్కడి గట్టిపిండాల గురించి వివరించలేదు. పని మాత్రం కాయో పండో తెలియదన్నట్టుగా చేసుకురావద్దని మొహం చిరాగ్గాపెట్టి హెచ్చరిక అయితే చేసాడు. అక్కడితో సరి. ఆ హెచ్చరికని సవాల్‌గా తీసుకుని అడుగు ముందుకు వేశాడు చలపతి.

***

ఆ రోజు ఆఫీసునించి ఇంటికెళ్ళేసరికి ముందు గదిలో బావమరిది కనిపించాడు రామారావుకి.

ఎలాఉన్నారు బావగారూ అంటూ కుశల ప్రశ్నలడిగిన అతనికి ఏదో జవాబు ఇచ్చానంటే ఇచ్చానన్నట్టుగా చెప్పి ఎదురుగా కుర్చీలో కూచున్నాడు.

''హఠాత్తుగా ఈ ఊళ్ళో పనిపడింది బావగారూ... స్నేహితుడొకడు, తన కార్లో ఈ ఊరొస్తుంటే అతనితో నేనూ బయల్దేరిపోయాను..''

రామారావు మనసిక్కడలేదు...

బావమరిది చెప్పేకబుర్లు గాల్లో కొట్టుకుపోతున్నాయి.

చెన్నయ్‌లో పని సాధించుకొచ్చిన చలపతే కళ్ళ ముందు కనిపిస్తున్నాడు.

పైగా ''రామారావు నీకు సలహాలవీ చక్కగా ఇచ్చినట్టున్నాడు. పని సాధించుకొచ్చే మార్గాలు అన్నీబోధపరచినట్టున్నాడు. వెళ్ళినపని వాయిదాల్లేకుండా నెరవేర్చు కొచ్చావు'' అన్న ఆఫీసర్ గారి మాటలకి ఎంతో సంతోషంగా ఔనని బదులిచ్చాడుట.

''క్రెడిట్ అంతా రామారావు గారికే దక్కుతుంది సార్. ఆయన అనుభవజ్ఞులు. వారి సలహాలూ సూచనలూ అనుసరించబట్టే గానీ లేకపోతే అవుతాయా అంత క్లిష్టమైన పనులు'' అన్నాడట. ఇలా అన్నాడని ఆఫీసర్‌గారే చెప్పారు.

''కాఫీ తీసుకోండి...'' ఎదురుగా టీపాయ్ మీద కాఫీ కప్పు పెట్టింది వాణి. ఉలిక్కి పడ్డట్టుగా ఆలోచనల్లోంచి ఇవతలికి వచ్చాడు.

ఊర్నించి బావమరిది వొచ్చాడన్న స్పృహే లేనట్టుగా ఉన్నాడు.

''అలా ఉన్నారేం బావగారూ? ఆఫీసులో పని ఎక్కువగా ఉందా?''

''ఊ... ఏమిటీ?.... ఆ... ఆ... ఆ.. ఔను...''

ఆ పరాకేవిటో... ఆ పరధ్యానం ఏమిటో అర్థం కాక నుదురు చిట్లించి కళ్ళతోనే ప్రశ్నిస్తూ అక్కవైపు చూశాడు తమ్ముడు.

ఏమో అన్నట్టుగా పెదాలు విరిచింది వాణి.

ఏ మనిషి ఎప్పుడు ఏ విషయంలో మధనపడుతూ మనశ్శాంతి లేకుండా చేసుకుంటాడో ఎవరు చెప్పగలరు?

మనశ్శాంతిగా బ్రతకడం ఎంతోమందికి తెలియదు. ఈ మాట అంటే వాళ్ళు ఒప్పుకోరు. కానీ ఇందులో అబద్ధం లేదు. ఇది ముమ్మాటికీ నిజం.

ఏ సమస్యలూ లేకుండా జీవితం సాఫీగా జరిగిపోతున్నా తోచదు కొందరికి. మనిషన్నాక ఏవో సమస్యలొస్తూ పోతూ ఉండడం అతి సహజం.

ప్రశాంత చిత్తంతో వాటికి పరిష్కారమార్గాలు ఆలోచించకుండా గోరంతలు కొండంతలు చేసుకుంటూ... సమస్యలు ఇంట్లోవి అయినా బయటవి అయినా... లేదా అసలు తనకి సంబంధం లేనివి అయినా అన్నిటికీ మనశ్శాంతి కోల్పోతూ అనవసరంగా కాలం వృథా చేసుకోవడమే కాక ఇతరుల విలువైన కాలాన్ని కూడా తమ ఆదుర్దాతో సమీక్షలతో నష్టపరుస్తారు కొందరు.

ఈర్ష్యాద్వేషాలు కూడా మనసుతో ఆడుకుంటూ మనశ్శాంతికి మనిషిని దూరం చేసేవే...

ప్రస్తుతం రామారావు ఈ పరిస్థితిలో ఉన్నవాడని ఆ అక్కా తమ్ముళ్ళిద్దరికీ తెలియదు.

ఆ రోజెప్పుడో మనిషి మంచితనం... కొలబద్దా అంటూ తనతో మాట్లాడిన భర్త మాటలకి... ఈ రోజు ఈ పరధ్యానానికీ సంబంధం ఉందని వాణికి ఏం తెలుసు?

***

''చలపతీ వాళ్ళ నాన్నగారికి ఒంట్లో బాగులేక హాస్పిటల్లో ఎడ్మిట్ చేశాడట. ఆఫీస్‌నించి ఇంటికెళ్ళేటప్పుడు ఒకసారి చూసేసి వెళ్దామా?'' విశ్వనాథం అడిగిన ప్రశ్నకి అయిష్టంగా చూశాడు రామారావు.

''నేను రాను... నువ్వెళ్తే వెళ్ళు''.

''అలా అనేశావేంటోయ్?.... పాపం... వెళ్ళి చూసిరావద్దా?''

''నాకొంట్లో బాలేదు... నన్నొదిలెయ్...'' విసుగ్గా ధ్వనించింది గొంతు.

అంతకోపం ఎందుకొచ్చిందో అర్థం కాక వింతగా చూశాడు విశ్వనాథం.

సాయంత్రం హాస్పిటల్‌కి వెళ్ళిన అతన్ని చూస్తూనే ''రండి... మీరొక్కరే వొచ్చారా?'' అంటూ యధాలాపంగా అడిగాడు చలపతి.

ఎవరిని మనసులో పెట్టుకుని ఆ మాట అడిగి ఉంటాడో ఊహించాడు విశ్వనాథం.

ఎందుకంటే పొద్దున్న చలపతికి ఫోన్లో తనే చెప్పాడు మరి... రామారావు నేనూ సాయంత్రం హాస్పిటల్‌కి వొస్తాం అని.

''రామారావుకి కాస్త ఒంట్లో బాగులేదు... అందుకే నేనొక్కడినే వొచ్చాను'' అంటూ చలపతి తండ్రిని పలకరించేందుకు మంచానికి దగ్గరగా వెళ్ళాడు విశ్వనాథం.


ఆ రాత్రి రామారావుకి తన మొబైల్‌నించి ఫోన్ చేశాడు చలపతి.

''మీకు ఒంట్లో బాగులేదని చెప్పారు విశ్వనాథం గారు. ఇప్పుడెలా ఉంది? బాగా రెస్టు తీసుకోండి'' అంటూ చలపతి పలకరిస్తుంటే రామారావు నోట్లోంచి మాటే రాలేదు.

వాళ్ళనాన్న గారికేమైందని గానీ... ఎలా ఉన్నారని గానీ తను ఫోన్లోనయినా అడగలేదు. కానీ అతను? ప్చ్... పోనిద్దూ...

ఆలోచించడానిక్కూడా ఇష్టపడలేదు మనసు...

ఏ వ్యక్తి అంటే ఇష్టం లేదో ఆ వ్యక్తి మంచితనాన్ని ఎదురుగా గమనించినా కూడా ఒప్పుకోవడానికి ఇష్టపడని... ఆ మంచితనానికి వక్రభాష్యం చెప్పుకోవడానికి ఇష్టపడే మనస్తత్వాలకి ఆలోచించే అవసరం ఎందుకు కనపడుతుంది?



అందుకే రామారావుకి తన ప్రవర్తనలో పొరపాటు గానీ నొచ్చుకోవలసిన విషయం గానీ కనపడలేదు.

***

"ఎందుకోగానీ ఆ చలపతి నన్ను కాకా పట్టాలని నాకు మస్కా కొట్టాలని చూస్తున్నట్టుగా కనిపిస్తోంది".

పకపకా నవ్వాడు జనార్దనం. "అతనెప్పుడూ అలాంటి పనులు చెయ్యడు".

"రామారావు సలహాలు సంప్రదింపుల వల్లే చెన్నయ్‌లో పని సవ్యంగా చేసుకురా గలిగావు కదా అని ఆఫీసరు గారంటే ఔనని జవాబిచ్చాడట. ఆ మాట ఆఫీసర్‌గారే చెప్పారు నాతో."

"అందుకని అలాంటి అభిప్రాయానికొచ్చేశావా? చాలా పొరపాటు పడుతున్నావు. నీ గురించేకాదు... ఎవరి గురించైనా సరే... ఏ విషయమైనా సరే అతనలాగే మాట్లాడ తాడు. అతనిలో ఉన్న సుగుణం అది. తన గొప్పతనాన్ని ఇతరులకి ఆపాదిస్తాడు.... అదిగో... అతనే వొస్తున్నాడుగా ఇటువైపు... ఇంటర్వ్యూ చేద్దామా?"

తుళ్ళిపడ్డాడు రామారావు... అమ్మో..! తలతిక్కవాడిలా ఉన్నాడే ఈ జనార్ధనం... కొంప ముంచేలా ఉన్నాడు...

"రావోయ్ చలపతీ రా... నీ గురించే మాట్లాడుకుంటున్నాం..."

"నా గురించి ఏవుంది సార్ మాట్లాడుకోడానికి?...." చేతులు జోడించి నవ్వుతూ చూశాడు జనార్ధనం వైపు.

"అందరికీ మంచివాడివి నువ్వు.... నీ గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే..."

"ఊర్కోండిసార్... అందరికీ మంచివాడినెలా అవుతాను? కొందరి దృష్టిలో చెడ్డవాడిగా ఉంటూనే ఉంటాను".

భుజాలు తడుముకోవలసి వచ్చింది రామారావుకి... తనని ఉద్దేశించి అంటున్నాడా... జనార్ధనం ఊరుకుంటేగా.... సంభాషణ పొడిగించాడు హుషారుగా.

"ఏవీ... నువ్వన్నదానికి ఏవైనా ఒకటి రెండు ఉదాహరణలు చెప్పు... నిజాలే చెప్పాలి సుమా!"

నవ్వాడు చలపతి "మీరడిగారు కాబట్టి చెప్తున్నాను గానీ... అవతలవాళ్ళ మీద కోపంతో చెప్పట్లేదు... పిల్లల్ని బాగా ఖరీదైన బడిలో వెయ్యమంటాడు మా మావగారు. అంత ఖర్చుభరించే జీతం నాది కాదు అని వెయ్యలేదు నేను. లంచాలు తీసుకుంటూ ఉంటే ఆ ఖర్చు భరించడం కష్టమవ్వదు అంటాడు. ఆయన. నేనా పని చెయ్యను... హైక్లాస్ బళ్ళో వెయ్యను... అలాంటప్పుడు ఆయన దృష్టిలో నేను మంచివాడినా?... మీరే చెప్పండి..." ఒక్క క్షణం ఆగినవ్వుతూ మళ్ళీ అన్నాడు. "ప్రయాణ సదుపాయం లేని చాలా చిన్న పల్లెటూళ్ళో ఇంకెవ్వరూ తోడు లేకుండా రోజులు గడుపుతున్న మా అమ్మానాన్నాల్ని ఇక్కడికి మా ఇంటికి తీసు కొచ్చేశాను. అది వాళ్ళిద్దరికీ కూడా ఇష్టం లేదు. ముక్కుతూ మూలుగుతూ అక్కడే ఉంటాం అంటారు. వైద్యసదుపాయం కూడా లేదక్కడ... వాళ్ళు వొద్దన్నా ఇక్కడికి తీసుకొచ్చినందుకు వాళ్ళ దృష్టిలో నేను మొండివాడినవుతాను గానీ మంచివాడినా? ఏవంటారు? ఇలాంటివే ఇంటా బయటా ఉంటూ ఉంటాయిలెండి... అందుకని..."

వింటున్న శ్రోతలిద్దరూ నోళ్ళు తెరుచుకుని చూస్తుండిపోయారు.

"వొస్తాను సార్!" అతను వెళ్ళినవైపే చూస్తూ నెమ్మదిగా రామారావు భుజాన్ని తడుతూ జనార్ధనం చెప్పిన మాటలకి కుర్చీలో బిగుసుకుపోయాడు రామారావు.

"చలపతికి ప్రమోషన్ రాకుండా ప్రతీసారీ నువ్వే అడ్డుకుంటున్నావని... అతని మీద లేనిపోని మాటలు ఆఫీసరుకి నువ్వే చెప్తున్నావని ఆ చలపతికి ఎప్పుడో తెల్సు..."

"ఎలా తెలుసు?" కష్టపడి మాట పెగుల్చుకున్నాడు.

"గూఢచారి పని చేసే వాళ్ళూ.... మాటలు చేరవేసే వాళ్ళూ ఈ ఆఫీసులో నువ్వు తప్ప ఇంకెవ్వరూ ఉండరని ఎలా అనుకుంటున్నావు?"

"తనకి తెలుసని చలపతే చెప్పాడా నీకు?" నీరసంగా లంఖణాలు చేసినవాడిలా ధ్వనించింది రామారావు గొంతు. అన్నీ తెలిసి కూడా అతనికి తన మీద కోపం లేదే! అమర్యాదగా ఎప్పుడూ తనని చూడలేదే! ఎన్నడూ తనని అగౌరవపరచలేదే!

"చలపతి మంచితనం ఇంకా నీకు సరిగ్గా అర్థం కాలేదన్నమాట... అతను చెప్పలేదు నాకు. అతనితో ఈ విషయాలన్నీ చెప్పినవాడే స్వయంగా నాతో చెప్పాడు... పైగా నీతో దెబ్బలాడమని కూడా సలహా ఇచ్చాడట ఆ వ్యక్తి. చేతులు జోడించి నవ్వి ఊరు కున్నాడట చలపతి".

రామారావు పళ్ళు పటపటలాడుతూ దవడ కండరాలు కదిలాయి "ఇంతకీ ఎవరు వాడు?"

"అమ్మమ్మ... అదిమటుకు అడగకు.." అది నేనే అన్నమాట నోటినించి జార నివ్వకుండా.... లేచి వెళ్ళొస్తానన్నట్టుగా చెయ్యి ఊపి నిర్లక్ష్యంగా కుర్చీ వెనక్కి తోసి వడివడిగా అక్కడినించి వెళ్ళిపోయాడు జనార్దనం.

కనురెప్పలు వాల్చి వెనక్కి వాలాడు రామారావు కుర్చీలో.

చిన్నప్పుడు చదువులో తనకంటే తెలివితేటలు చూపించిన తమ్ముడి పట్ల ఈర్ష్య.... ఉద్యోగంలో చేరాక పక్కింటి వాడి జీతం తన జీతం కంటే ఎక్కువని అతడిని చూస్తే ఈర్ష్య....

పెళ్ళయ్యాక... ఇంటి బడ్జెట్ విషయంలో తన కంటే బాగా తన భార్య సమర్థించగలదని ఆమెని చూస్తే ఈర్ష్య...

ఆఫీసులో.... చాలా మంచిమనిషిగా పేరు తెచ్చుకున్న చలపతిని చూస్తే ఈర్ష్య.... అది ఎవరిలో ఉందో ఆ వ్యక్తికి తెలియకుండానే నిరంతరం అతడి మనసుని కాల్చేసే శక్తి దానికి ఉందని తెలుసుకోలేక... దాంతోనే రగిలిపోతున్న మూర్ఖుడై ఉండి కూడా మరొకరి మంచితనాన్ని అంచనా వేయాలని చూడటం ఎంత హాస్యాస్పదం? ఎవరి మంచితనాన్ని అయినా కొలవడానికి కావల్సిన కొలబద్ద ఏమిటని తలబద్దలు కొట్టుకున్నాడే?

ఈర్ష్య అసూయ ద్వేషం కపటం కల్మషం ఎన్ని ఉన్నా ఎంత ఉన్నా కాసేపు వాటిని పక్కకి పెట్టి నిష్కల్మషమైన ప్రశాంత చిత్తాన్ని కొలబద్దగా చేసుకుంటే తప్ప ఎదుటి వ్యక్తిలోని మంచితనాన్ని అంచనా వేయడం కుదరదన్న సత్యం బోధపడింది రామారావుకిప్పుడు. మనసు తేలికపడింది... ఎన్నాళ్ళగానో తాను కోల్పోయిన ప్రశాంతత చేకూరి నట్లయింది.

*

రచయిత సెల్ నెం: 944118782

కవిత




## ఆఖరి రీలు

కేరింతలు ఈలలు
ఉదయం ఆట అయిపోయిందెప్పుడో
పాప్‌కార్న్ మాట్నీ
చెమట్లని మాత్రం మిగిల్చింది
పెళ్లాం పిల్లలతో సరదాగా చూసిన
మొదటాటా ముగిసింది
ఉబలాటమున్నా
కునికిపాట్ల సెకండ్‌షో!
ఎగ్జిట్ లైటు వెలిగి
తలుపులు తెరుచుకునే దెప్పుడో!?

-ఎస్.హనుమంతరావు